క్లుప్తంగా

వైఎస్సార్ ఆసరా నగదు జమపై హర్షం

మాకవరపాలెం: మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని వైస్ ఎంపీపీ లక్ష్మి, తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నగదు జమ సందర్భంగా తామరం సచివాలయం వద్ద మంగళవారం లబ్ధిదారులతో కలసి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం ఏమాత్రం వెనక్కి తగ్గలేదన్నారు. ఆసరా పథకంలో ఒక్క మాకవరపాలెం మండలానికే 1,231 సంఘాల్లో 13,992 మంది సభ్యులకు రూ.9 కోట్ల 23 లక్షలు లబ్ధి చేకూరిందన్నారు. అందుకే మళ్లీ సీఎంగా జగన్‌నే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లా రత్నం, పీఏసీఎస్ డైరెక్టర్ ద్వారపురెడ్డి అయ్యన్న పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి ‘ఆడుదాం ఆంధ్రా’

మాడుగుల: స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి ‘ఆడుదాం-ఆంధ్రా’ పోటీలు బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయని ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరు కానున్నారన్నారు.

ఆరోగ్య సురక్షలో 423 మందికి వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి, వైద్యులు

దేవరాపల్లి: తెనుగుపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యుడు మహ్మద్ అమీర్, గైనకాలజిస్టు బి. రోజారాణి, దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన 423 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కిల్లాన శ్రీనివాసరావు, ఎంఎల్‌వో ఎ. పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయునికి సత్కారం



బాబూరావు మాస్టారును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం: బదిలీపై వెళ్లిన బాబూరావు మాస్టారును హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు మంగళవారం టి.అర్జాపురం హైస్కూల్‌లో ఘనంగా సత్కరించారు. 2017 మార్చిలో ఇక్కడకు ఉపాధ్యాయునిగా వచ్చి ఆనాటి నుంచి ఎంతో చక్కగా తన విధులను నిర్వర్తిస్తూ పలువురి మన్ననలు పొందారు. రావికమతం హైస్కూల్‌కు ఇటీవల బదిలీకాగా ఆయనను హెచ్‌ఎం కేఆర్‌ఎస్ నాయుడు, సహచర ఉపాధ్యాయులు సత్కరించి వీడ్కోలు పలికారు.

మున్సిపల్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



గొలుగొండ: సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పెట్ల ఉమాశంకర్‌గణేష్



నర్సీపట్నం: సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమిచ్చామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. పట్టణంలోని 24, 27 వార్డుల్లో రూ.30 లక్షతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 17 సచివాలయాలకుగాను ఒక్కొక్క సచివాలయానికి రూ.40 లక్షల చొప్పున కేటాయించామన్నారు. ఈ నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. కొన్నేళ్లుగా అంతర్గత రహదారులు లేక ఇబ్బందులు పడుతున్న ఆయా వార్డుల ప్రజలకు వీటి కష్టాలు తీర్చామన్నారు. అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు అన్నారు. రూ.10.60 కోట్లతో మెయిన్ రోడ్డును విస్తరిస్తున్నామన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి వరకు ప్రత్యామ్నాయ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. ఈ రహదారుల నిర్మాణంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కానుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషా బేగం, కమిషనర్ రవిబాబు, వివిధ ఆలయాల చైర్మన్లు ధనిమిరెడ్డి నాగు, దేవత అరుణ, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కణితి అన్నపూర్ణ, లలిత, నాయకులు చిటికెల కన్నబాబు, ఏకా రాజుబాబు, యూత్ నాయకులు ధనిమిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లోనే అన్ని సేవలు..

గొలుగొండ: గ్రామాల్లో ప్రజలకు శతశాతం ప్రభుత్వ సేవలందించేందుకు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చెప్పారు. గొలుగొండలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి గ్రామ సచివాలయాలను నిర్మిస్తున్నామన్నారు. వీటి ద్వారా ఆయా గ్రామాల పరిధిలో ప్రజలకు సేవలందుతున్నాయన్నారు. వీటిని గుర్తించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జెలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, యూత్ అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణ నాయుడు, సర్పంచ్ జాగు రాము, నేతలు పాని శాంతారాం, రామకృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచెల సుజాత పాల్గొన్నారు.

జుత్తాడలో రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాలు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం: జుత్తాడ గ్రామంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మంగళవారం తెలిపారు. కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాలని ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు కోరారన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేశారన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

‘సీఎం జగన్ వెంటే అమ్మపేట గ్రామస్తులు’



మాట్లాడుతున్న అమ్మపేట వైఎస్సార్‌సీపీ నేతలు

గొలుగొండ: సీఎం జగన్ వెంటే అమ్మపేట గ్రామస్తులు ఉన్నారని వైఎస్సార్‌సీపీ అమ్మపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు ఈగల పెదబాబులు, ఉప సర్పంచ్ తంగేటి నానిబాబు తెలిపారు. మంగళవారం రాత్రి గ్రామంలో వారు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ నిద్ర దేముడునాయుడు మొదటి నుంచి టీడీపీ సానుభూతిపరునిగా ఉన్నాడని ఆరోపించారు. అదే పార్టీ మద్దతుతో సర్పంచ్‌గా గెలిచి మరలా మాజీ మంత్రి అయ్యన్న సమక్షంలో చేరాడన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్టు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. రెండేళ్ల కిందట సర్పంచ్‌గా గెలిచిన దేముడునాయుడు అధికార పార్టీ గొడుగు కిందకు చేరారన్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన ఆరుగురు వార్డు మెంబర్లు, అనుబంధ కమిటీ సభ్యులు, గ్రామస్తులంతా ఎమ్మెల్యే గణేష్ గెలుపు కోసమే పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు రమణ, లక్ష్మి, వరలక్ష్మి, అప్పలనర్స, రమణ, చన్నబుల్లి, బూత్ కమిటీ కన్వీనర్ ఈగల రమణ పాల్గొన్నారు.

నేడు ఎం.కె. వల్లాపురంలో ‘గడప గడపకు’

మాడుగుల రూరల్: ఎం. కోటపాడు సచివాలయ పరిధి ఎం.కె.వల్లాపురంలో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధ వారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ మంగళవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సంక్షేమ లబ్ధిని వివరిస్తారన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేతాజీకి ఘన నివాళులు



తూటిపాలలో సెల్యూట్ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కె.కోటపాడు: చంద్రబోస్ చిత్రపటానికి పూల మాల వేస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి

మాకవరపాలెం: సుభాష్ చంద్రబోస్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి ఎంఈవో మూర్తి ఘన నివాళులర్పించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా హెచ్‌ఎం రాము విద్యార్థులకు ఆయన చేసిన సేవలను వివరించారు. అందరూ చంద్రబోస్ చిత్రపటానికి సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతకు సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తిదాయకం

కె.కోటపాడు: స్వాతంత్ర్య సంగ్రామంలో సుభాష్ చంద్రబోస్ చూపిన పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమని గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు. మంగళవారం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు నేతాజీ ఆదర్శనీయుడు

చోడవరం రూరల్: ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ మాట్లాడుతూ ఇండియన్ ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి పొరుగు దేశాల సమన్వయంతో నేతాజీ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ వ్యక్తిత్వం, దేశ సేవలో ఆయన చూపిన చొరవను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, లక్ష్మీమంగమ్మ, ఉపన్యాసకులు ఎస్‌ఎం.రఫీయుద్దీన్, తాతారావు, వి.అప్పలనాయుడు, సత్యవతి, కోమల, సూర్యవతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెదనందిపల్లి సత్యనారాయణ స్వామి తీర్థం నేడు

- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు



ముస్తాబైన పెదనందిపల్లి సత్యనారాయణ స్వామి పురాతన ఆలయం



మాడుగుల: మోదకొండమ్మను దర్శించుకుంటున్న ఆలయ కమిటీ చైర్మన్ వెంకటరమణ

దేవరాపల్లి: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పెదనందిపల్లి విజయ వెంకట సత్యనారాయణ స్వామి తీర్థ మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. బుధవారం ఇక్కడ ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయం తర్వాత అంతటి విశిష్టత కలిగిన పెదనందిపల్లి సత్యనారాయణ స్వామి తీర్థ మహోత్సవాన్ని రెండు రోజులు పాటు పెదనందిపల్లి, చిననందిపల్లి, మారేపల్లి, చేనులపాలెం, తారువ, తిమిరాం, ఎం. అలమండ తదితర గ్రామాల ప్రజలు జరుపుకుంటారు. ఏటా మాదిరిగా తొలిరోజు బుధవారం అతి వైభవంగా నిర్వహించే తీర్థానికి ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి వేలాదిగా భక్త జనం తరలి రానున్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. కొండపై ఆలయం వద్దకు మెట్ల మార్గం గుండా చేరుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ డి. నాగేంద్ర ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక ఆంక్షలు విధించడంతోపాటు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఒమ్మలిలో మోదకొండమ్మ తీర్థం...

మాడుగుల: ఒమ్మలిలో మోదకొండమ్మ తీర్థం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పసుపు కుంకుమతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన రంగులరాట్నాలు, మహిళా కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు జైతవరంలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు

చీడికాడ: జైతవరంలో తాళ్లమాంబ తీర్థం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు బుధవారం నిర్వహించనున్నట్టు సర్పంచ్ కోదూరి సత్యవతి, ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

26న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

బుచ్చెయ్యపేట: కందిపూడిలో ఈ నెల 26న సీతారాముల తీర్థం సందర్భంగా జిల్లా స్థాయి క్విజ్ పోటీలు ఏర్పాటు చేశామని ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ రూ.6,016, ద్వితీయ రూ.4,016, తృతీయ బహుమతిగా 3,016 అందజేస్తామన్నారు.

రూ.1.26 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సం నేడు

హాజరు కానున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



మారేపల్లిలో నిర్మించిన ఆర్బీకే భవనం

దేవరాపల్లి: ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలోనే గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన భవన నిర్మాణాలు పూర్తి కావడంతో వీటి ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మారేపల్లిలో రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బుధవారం ఉదయం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. కలిగొట్లలో రూ. 17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, కలిగొట్ల – అర్జునగిరి రోడ్డు నుంచి బండారుపాలెంకు రూ. 87 లక్షలతో 1.51 కిలోమీటర్ల మేర నిర్మించిన తారురోడ్డును శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభిస్తారన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయకుమార్

రోలుగుంట: ముందుగా ప్రణాళికలను తయారు చేసుకున్నప్పుడే పంచాయతీ అభివృద్ధి మెరుగ్గా ఉంటుందని ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించి మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన ఈవోపీఆర్డీ ఎస్.నూకరాజు, సంతోష్ అభివృద్ధి ప్రణాళికల తయారు, నిధుల మంజూరు, వినియోగంపై అవగాహన కల్పించారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ సిబ్బంది



కె.జె.పురం కేంద్రం -1లో చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న కార్యకర్త

మాడుగుల రూరల్: గత నెల 12వ తేదీ నుంచి సమ్మె చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మంగళవారం నుంచి విధుల్లో చేరారు. చిన్నారులకు పాఠాలు చెప్పారు. గర్భిణులు, బాలింతలకు భోజనం తయారు చేసి పెట్టారు. మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 158 కేంద్రాల్లో సిబ్బంది విధుల్లో చేరారని సీడీపీవో సిహెచ్. శ్రీదేవి తెలిపారు. ఇంతవరకు గ్రామాల్లో మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది సారథ్యంలో సమ్మె కాలంలో కేంద్రాలు తెరిచారన్నారు.

గొలుగొండ: అంగన్‌వాడీ సిబ్బంది మంగళవారం విధుల్లోకి చేరారని స్థానిక ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి తెలిపారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా ప్రభుత్వం నుంచి హామీ రావడంతో మండలంలోని 92 కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, ఆయాలు విధులకు హాజరయ్యారన్నారు.

చీడికాడ: ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో చీడికాడ, పెదగోగాడ సెక్టార్లలో అంగన్‌వాడీ కేంద్రాలు మంగళవారం తెరుచుకున్నాయి. బుధవారం నుంచి మండలంలో అన్ని కేంద్రాలు యథావిధిగా నడుస్తాయని యూనియన్ నేతలు తెలిపారు.

మహా రాజశ్రీ చోడవరం 9వ అదనపు జిల్లా మరియు సెషన్సు జడ్జి వారి కోర్టులో
O.S. No. 156/2013

బుద్దా శ్రీనివాసరావు ..... వాది
మరియు
కిల్లి జగ్గారావు వగైరాలు ..... ప్రతివాదులు

దావా సమను

19, 24 టు 26 ప్రతివాదులుకు:
19. వేచలపు నానాజీ, తండ్రి మహాలక్ష్మి నాయుడు, వేచలం గ్రామం, దేవరాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా
24. గూనూరు శ్రీకాంత్, తండ్రి లేటు వెంకట సత్యనారాయణ (తండ్రి సింహాచలం)
25. గూనూరు లక్ష్మి, తండ్రి లేటు వెంకట సత్యనారాయణ (తండ్రి సంహాచలం)
26. గూనూరు ప్రశాంతి, తండ్రి లేటు వెంకట సత్యనారాయణ (తండ్రి సింహాచలం)

24 టు 26 ప్రతివాదులు నివాసం పాత లైబ్రరీ ఎదురుగా, లక్ష్మమ్మ గుడికి ఉత్తర దిశను గల ఇంటిలో, పెదవెలమ వీధి, చోడవరం గ్రామం మరియు మండలం, అనకాపల్లి జిల్లా, పై నెంబరు దావాలో, వాది మీపై దావా దాఖలు చేసియున్నాడు. సదరు దావా తే. 16.02.2024దీకి వాయిదా అయి ఉన్నది. కావున వాయిదా నాడు పై కోర్టులో ఉదయం 10.30 ని.లకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి మీకు ఎట్టి అక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

చోడవరం
తే. 23.01.2024
కె.భాస్కర్‌దాస్
వాది తరపు వకీలు
ఫోన్ నెం: 9440042677

పేదల ఆరోగ్యానికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ భరోసా

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు



ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరావు

దేవరాపల్లి: డాక్టరు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయం-1లో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తిలతో కలిసి ఆయన లబ్ధిదారులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. ఆరోగ్య శ్రీతో పేదలు సైతం ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందే అవకాశం కల్పించారన్నారు. ప్రాణం విలువ తెలిసిన నాయకుడిగా ఆరోగ్య శ్రీలో వైద్యం ఖర్చు వ్యయాన్ని రూ.25 లక్షలకు పెంచి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో బండారు దేముడునాయుడు, పంచాయతీ సెక్రటరీ ఎస్. శ్రీనివాసరావు, సచివాలయ సెక్రటరీ రత్నం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: కందిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. మంగళవారం ఈ శిబిరంలో 352 మంది రోగులను వైద్యులు కేవీ కృష్ణ, విజయకుమార్‌గౌతమ్ పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, ఎంపీటీసీ దేవర అప్పారావు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా

- ఆర్డీవో హెచ్.వి.జయరాం



అధికారులు, రాజకీయ నాయకులతో సమావేశమైన ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: తప్పులు దొర్లకుండా తగిన జాగ్రత్తలతో ఓటరు జాబితా ఉండాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులకు సూచించారు. నాలుగు మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్‌ల్లో ఉన్నాయని రాజకీయ పార్టీల నాయకులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు చేసినప్పటికీ సరైన పరిష్కారంలేదని వాపోయారు. తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులను చాలా వరకు పరిష్కరించామని ఆర్డీవో పేర్కొన్నారు. ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తహసీల్దార్లు అన్నాజీరావు, ఆనందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏకా శివ, రుత్తల శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు గవిరెడ్డి వెంకటరమణ, బీజేపీ నాయకుడు అడిగర్ల సతీష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

నాతవరం: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ జేఈ జోగారావు తెలిపారు. నాతవరం, పెదగొలుగొండపేట గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లలో మంగళవారం ఆయన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ప్రభుత్వం అదనంగా ఇంకుడు గుంతకు రూ.6 వేలు మరుగుదొడ్డికి రూ.12 వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఇంటికి ఉచితంగా విద్యుత్ మీటరు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తుందన్నారు. లేఅవుట్లలో సర్వాంగ సుందరంగా సీసీరోడ్లు, వీధిలైట్లు కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రం మంజూరైందని, విద్యార్థులు ఆన్‌లైన్లోగాని, ఆఫ్‌లైన్లోగాని దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో జాను ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాలు దాటిన వారు పదో తరగతి, 17 సంవత్సరాలు దాటిన వారు ఇంటర్ ప్రవేశ పరీక్షలు రాసేందుకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సేంద్రియ పంటలతోనే ఆరోగ్యం

రోలుగుంట: ప్రకృతి వ్యవసాయ పంటలతోనే ఆరోగ్యం సాధ్యమని ఆ శాఖ మండల ఇన్‌చార్జి నిర్మల అన్నారు. ప్రకృతి వ్యసాయశాఖ ఆధ్వర్యంలో సేంద్రియ విధానంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల స్టాల్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రదర్శించారు. ఈ స్టాల్‌ను సందర్శించిన పలువురికి రసాయన సాగు, ప్రకృతి సాగు ద్వారా పండించే పంటలు, వాటి వినియోగంలో ఆరోగ్య సమస్యలపై యూనిట్ ఇన్‌చార్జి మోదినాయుడు అవగాహన కల్పించారు. ఆ శాఖ సిబ్బంది జ్యోతి, నాగకాంతం, సుజాత, భావన తదితరులు సందర్శకుల సందేహాలు నివృత్తి చేశారు.

ఒమ్మలి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

మాడుగుల రూరల్: హెచ్‌ఎం జగ్గారావునాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఒమ్మలి జెడ్పీ హైస్కూలులో 8వ తరగతికి చెందిన 62 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. వీటితోపాటు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంట పాత్రలను పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉగ్గిన అప్పలనాయుడు అందజేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డాపు భాస్కరరావు, వీజేపురం మాజీ సర్పంచ్ గూడెపు హరికృష్ణ, నాయకులు పూసర్ల వెంకట్రావు, పల్లె ఏసుబాబు, నర్సింహమూర్తి, పాల సొసైటీ అధ్యక్షుడు విజయకుమార్ పాల్గొన్నారు.





